క్లుప్తంగా

నేడు సరూర్‌నగర్ రైతు బజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎలాంటి అమ్మకాలు ఉండవని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టే రైతుబజార్‌లో మంగళవారం బోనాలు నిర్వహించామని, ఈ నేపథ్యంలో బుధవారం ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని ఆమె పేర్కొన్నారు. గురువారం యథావిధిగా రైతుబజార్ పని చేస్తుందని, ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని ఈఓ విజ్ఞప్తి చేశారు.

ఎల్‌బీనగర్ వాటర్ వర్క్స్ జీఎంగా శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌గా శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వినోద్‌కుమార్‌ను వాటర్ వర్క్స్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. కొత్త జీఎంగా విధుల్లో చేరిన శ్రీనివాస్‌రెడ్డికి గతంలో ఇక్కడ డీజీఎంగా పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, మంచినీటి సరఫరాతోపాటు పలు కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారంపై దృష్టి పెడతానన్నారు.

సింగిరెడ్డి ఆశయ సాధనకు కృషి

సైదాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మాజీ ఫ్లోర్‌లీడర్ దివంగత సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి విగ్రహం వద్ద ఆయన 60వ జయంతి వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరికీ మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, రవిశంకర్, సునీల్‌రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్ పాల్గొన్నారు.

బాలికపై బాలుడి లైంగిక దాడి

నిందితుడి అరెస్టు

సైదాబాద్: బాలికపై రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్న బాలుడిని పోలీసులు అరెస్ట్ చేసి జువైనల్ హోంకు తరలించారు. సైదాబాద్ పీస్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సింగరేణి కాలనీలో నివసించే పదో తరగతి విద్యార్థినిపై అదే బస్తీలో నివసించే తొమ్మిదో తరగతి విద్యార్థి రెండేళ్లుగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. బాలిక గర్భం దాల్చడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. వారి ఫిర్యాదుతో పోలీసులు బాలుడిని మంగళవారం అరెస్ట్ చేసి జువెనల్ హోమ్‌కు తరలించారు.

మలక్‌పేటలో బాలిక అదృశ్యం

మలక్‌పేట: బాలిక అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారానికి చెందిన ఓ బాలిక స్థానికంగా ఉన్న బ్యూటీపార్లర్‌లో పని చేస్తోంది. ఈనెల 1 తేదీ సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు తెలిసిన వారిని వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కాగా, కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు ప్రేమ పేరుతో బాలికను తీసుకెళ్లి ఉంటాడని బాలిక తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అరగంటలోపే అప్పగింత

సైదాబాద్: ప్రయాణికుడు పోగొట్టుకున్న విలువైన బ్యాగును సైదాబాద్ పోలీసులు అరగంటలోపే శోధించి బాధితుడికి అందజేశారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వ్యాపారి గణేష్ సొంతూరు నుంచి బస్సులో బయలుదేరి మంగళవారం తెల్లవారుజామున దిల్‌సుఖ్‌నగర్‌లో దిగాడు. అక్కడి నుంచి సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలోని సోదరి ఇంటికి ఆటోలో వెళ్లాడు. ఆటో దిగే తొందరలో తన బ్యాగు ఒకటి ఆటోలో మరిచిపోయాడు. అందులో రూ. 45 వేల నగదు, ఒక సెల్‌ఫోన్, ఒక స్మార్ట్ ఫోన్ ఉన్నాయి. సోదరి ఇంటిలోకి వెళ్లిన తర్వాత బ్యాగ్ ఆటోలో పోగొట్టుకున్నానని గుర్తించి వెంటనే సైదాబాద్ పోలీసులకు సమాచారమిచ్చాడు. స్పందించిన పోలీసులు సాంకేతిక సహాయంతో అరగంటలోపే ఆటోడ్రైవర్ ఇంటిని గుర్తించి వెళ్లారు. పోలీసులు వచ్చే వరకు ఆటోడ్రైవర్ కూడా ఆటోలోని బ్యాగ్‌ను గుర్తించలేదు. నగదు, విలువైన వస్తువులు సహా ఉన్న బ్యాగును ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి ప్రయాణికుడు గణేష్‌కు అందజేశారు. సత్వరమే స్పందించి తన నగదు, వస్తువులను అప్పగించిన పోలీసులకు వ్యాపారి గణేష్ కృతజ్ఞతలు తెలిపాడు.



ఆర్‌కేపురంలో వరద నియంత్రణకు మ్యాన్‌హోళ్ల వద్ద చర్యలు చేపట్టిన సిబ్బంది



అల్కాపురి కాలనీలో ప్రవహిస్తున్న వరదనీరు



హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్



బండ్లగూడ ఆనంద్‌నగర్ కాలనీలోకి వచ్చిన వరద నీరు



బండ్లగూడ శ్రావణిశ్రీ ఎన్‌క్లేవ్‌లో..

భారీ వర్షం.. ఆగమాగం

- కాలనీలు, రోడ్లు జలమయం
- పలు ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్
- మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న మూసీ

నాగోలు: నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని నాగోలు డివిజన్ బండ్లగూడలోని శ్రావణశ్రీ ఎంక్లేవ్ కాలనీ, ఆనంద్‌నగర్, హస్తినాపురం సాగర్ ఎంక్లేవ్ కాలనీ, మాన్సూరాబాద్ డివిజన్‌లో సాయి సప్తగిరికాలనీ, ఇతర ప్రాంతల్లో వరద నీరు కాలనీలోకి చేరాయి. నాగోలు డివిజన్ పరిధిలోనా సాయిరాంనగర్ కాలనీ, మమతానగర్, వెంకట్‌రెడ్డినగర్‌లో వరద నీరు చేరింది. నాగోలు, కొత్తపేట, ఎల్‌బీనగర్, సాగర్ రింగ్ రోడ్డు, చింతల కుంట ప్రాంతంలో వరద నీరు రహదారులపై చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షలతో వెంటనే అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ అధికారులు వరద నీరు రోడ్ల మీద నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం 12 గంటల వరకు భారీ వర్షం కురవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మలక్‌పేటజోన్ పరిధిలో...

దిల్‌సుఖ్‌నగర్: రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షానికి మలక్‌పేట జోన్ పరిధిలోని లోతట్టు కాలనీలు, ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. మంగళవారం కురిసిన వర్షానికి చాదర్‌ఘాట్, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, నల్గొండ క్రాస్‌రోడ్డులలో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే ట్రాఫిక్ అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వర్షానికి కాలనీల్లోని డ్రైనేజీ డ్రైనేజీలు పొంగి రహదారులపై మురుగునీరు ప్రవహించింది.

- అల్కాపురి, మార్గదర్శికాలనీ, టెలిఫోన్‌కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, శంకేశ్వరబజార్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్, కొత్తపేట తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. కొన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముంపు వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.
- మూసారాంబాగ్ బిడ్డి వద్ద మూసీనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో బ్రిడ్జిపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

వనస్థలిపురం: భారీ వర్షాలు కురుస్తున్నందున కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటికి రావద్దని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురిసిన వర్షానికి డివిజన్ పరిధిలోని హైకోర్టుకాలనీలో ప్రధాన మార్గంలో వరదనీరు చేరడంతో కార్పొరేటర్ అక్కడికి వెళ్లి మాన్‌సూన్ టీంతో నాలాకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగింపజేసి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలి

నాగోలు: భారీ వర్షాల నేపథ్యంలో కొత్తపేట డివిజన్‌లోని గోకుల్‌నగర్, గాయత్రి పురం కాలనీలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పర్యటించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలోని వర్షపు నీరు ఎటూ పోకుండా నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ పవన్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి మాన్సూన్ అత్యవసర టీమ్, ఏఈ మాత్యనాయక్‌ను పిలిపించి వెంటనే నీళ్లు ఎక్కడ ఆగకుండా వెళ్లిపోయేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌తో కలిసి పర్యటించి, ఎక్కడైనా వర్షం నీరు నిలుస్తుందా అనేది పరిశీలించారు. నాయకులు సంపత్ యాదవ్, లావణ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గత 24 గంటలుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మంగళవారం హస్తినాపురం డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతాలలో డీఆర్‌ఎఫ్ టీంతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రానున్న 48 గంటలు భారీ వర్షాలు పడనున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో పర్యటించిన జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్

మలక్‌పేట: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాలలో మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. సౌత్ జోనల్ కమిషనర్ వెంకన్న, సర్కిల్ -6 డిప్యూటీ కమిషనర్ జయంత్, ఈఈ పీర్‌సింగ్‌లతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. మూసారంబాగ్ బ్రిడ్జీ వద్ద మూసీనది తీర ప్రాంతాలు, మలక్‌పేట అక్షయ్ హోటల్‌ను సందర్శించి వరద పరిస్థితిని సమీక్షించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లను ఎత్తివేసి దిగువ ప్రాంతాలకు నీటి వదలడంతో.. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, నయాబ్ తహసీల్దార్ రాజు, ఆర్ఐ హరిబాబు, మధు వరద ప్రభావ ప్రాంతాల్లో వేర్వేరుగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

గుడిసెవాసులు అప్రమత్తంగా ఉండాలి..

బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మూసారంబాగ్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్‌రావుతో కలిసి మంగళవారం మూసీనది తీర ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్ పరిధిలోని శాలివాహన నగర్, అంబేద్కర్‌నగర్ గుడిసెవాసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మూసీలో వరద ప్రవాహం పెరిగినందువల్ల అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు.



హరిపురి కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



శ్రావణిశ్రీ ఎన్‌క్లేవ్‌లో వరద నీటిలో మునిగిన కార్లు, ద్విచక్ర వాహనాలు



కొత్తపేటలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్ కుమార్



మూసారంబాగ్‌లో బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న జడ్‌సీ వెంకన్న, ఈఈ పీర్‌సింగ్

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు

సైదాబాద్: తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని మెరిడియన్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ యువజన సర్వీసుల విభాగం, ఎంఐఎం పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెగా జాబ్ మేళాలో 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో వివిధ విద్యార్హతలు ఉన్న యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ కంపెనీలలో అవకాశాలు పొందిన వారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాబ్‌మేళాలను అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



యువకుడికి నియామకపత్రం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బలాల

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో...

హస్తినాపురం/మన్సూరాబాద్/ దిల్‌సుఖ్‌నగర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు.

- ఎల్‌బీనగర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (టీఎంఆర్‌జేసీ)బాలానగర్ గర్ల్స్-1లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్‌ఎల్‌సీ శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ పి.వినీల, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- కర్మన్‌ఘాట్‌లోని శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో విద్యావేత్త, పాఠశాల కరస్పాండెంట్ లెక్కల కృష్ణారెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, అనిత, గీతాంజలి పాల్గొన్నారు.
- హస్తినాపురంలోని రేస్‌మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో అధ్యాపకులకు కళాశాల డైరెక్టర్ హరిణి గిరిధర్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ నిహారికారావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో ...

- ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాయశాఖ విభాగం మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల సెక్రెటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్‌ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపునకు యత్నం.. ఉద్రిక్తత

సైదాబాద్: సింగరేణి కాలనీలో గుడిసెల తొలగింపు యత్నం ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలు .. ఇండస్ట్రియల్ కోపరేటివ్ సొసైటీకి చెందిన ఒకరికి అనువుగా కోర్టు తీర్పు వెలువడింది. కోర్టు బెయిలీఫ్ అతడికి స్థలం అప్పగించేందుకు పోలీసు బందోబస్తుతో మంగళవారం సింగరేణి కాలనీకి వచ్చారు. ఆ స్థలంలో ఐదు కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాయి. స్థలం స్వాధీనం కోసం వచ్చామని వారు తెలపడంతో గుడిసెవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పరిసర గుడిసెవాసులు, సేవాలాల్ బంజారా సంఘం నాయకులు మద్దతు తెలుపుతూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 30 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్న తమను ఎలా ఖాళీ చేయిస్తారని వారు ప్రశ్నించారు. గుడిసెలు తొలగించవద్దు అంటూ అక్కడే బైఠాయించారు. పోలీసులు వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గుడిసెవాసులు మాట్లాడుతూ, ప్రభుత్వం తమకు ఇక్కడే పట్టాలు ఇవ్వాలని, గుడిసెలు ఖాళీ చేయమని స్పష్టం చేశారు.

ఇస్కఫ్ మహాసభను విజయవంతం చేయాలి

ఎల్‌బీనగర్: కొత్తపేటలో ఈనెల 10న నిర్వహించే భారత సాంస్కృతిక సహకార సంఘ (ఇస్కఫ్) ప్రథమ మహాసభకు అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. మంగళవారం మీర్‌పేట గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఇస్కఫ్ మహాసభ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్ పాషాతో కలసి మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శులు చందు, షైమిదా, వెంకటరామ్‌రెడ్డి, మమబూబ్, పాపయ్య, కృష్ణ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మలక్‌పేట: శాంతి భద్రతల పరిరక్షణకు మైత్రి, పీస్ కమిటీ సభ్యులు సహకరించాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ గుంజి శ్రీనివాస్ అన్నారు. మలక్‌పేట మైత్రి కమిటీ చైర్మన్ లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌ను కలిశారు. ఇన్‌స్పెక్టర్‌ను శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, వినాయక చవితి, బతుకమ్మ, దసరా ఉత్సవాలు శాంతి యుతంగా ఆధ్యాత్మికమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. నేర రహిత సమాజం కోసం కాలనీ సంక్షేమ సంఘాలు, పీఎస్, మైత కమిటీ సహకారం కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, నవీన్, నాయకులు బస్వరాజ్‌గౌడ్, శ్రీనప్ప, నాగిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, వరుణ్‌కుమార్, ఆసీఫ్ పాల్గొన్నారు.

దేశ సమైక్యతను చాటి చెప్పాలి

మలక్‌పేట: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం మూసారంబాగ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మేరా మిట్టీ- మేరా దేశ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డిలు కార్యకర్తలతో కలిసి మట్టి సేకరించారు. 'మేరా మిట్టీ- మేరా దేశ్' కార్యక్రమంలో అందరూ భాగస్వాములై దేశ సమగ్రతను చాటి చెప్పాలని వారు కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, కోశాధికారి రమేష్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్, లక్ష్మణ్, ఉదయ్, రంజిత్,అంబాబాయి ఉన్నారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులో 9 మందికి జైలు

సైదాబాద్: ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులో తొమ్మిది మంది దోషులకు న్యాయస్థానం రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి తెలిపిన వివరాల ప్రకారం... 2015లో సైదాబాద్‌లో ఆస్తుల ధ్వంసం కేసులో 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారించిన నాంపల్లి 7వ ఏసీఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ సౌజన్య సోమవారం 9 మందిని దోషులుగా గుర్తించి వారికి రెండేళ్ల కఠిన జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 9 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఇదే కేసులో మరో ఐదుగురు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం: కలెక్టర్



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరీష్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూ, ఇరిగేషన్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మన్సూరాబాద్ 93/1లో రెండు ఎకరాల భూమి కబ్జాకు గురైందని, దానిని సర్వే చేయించాలని, లింగోజిగూడ గ్రీన్ పార్కు కాలనీలో నాలా కోసం ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఇంత వరకు నివేదిక ఇవ్వలేదని, జీఓ 118 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అలాగే, అన్యగల్ హయత్‌నగర్‌లోని సర్వే నెంబర్ 255లో రైతుల నుంచి గతంలో హెచ్ఎండీఏ అధికారులు భూమిని తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, రైతులు తిరిగి తమ భూములను సాగు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ధాతునగర్ కాలనీలో యూఎల్‌సీ భూములపై తుది నిర్ణయం తీసుకోవాలని, నందనవనం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అర్హులైన లబ్ధిదారులు ఉంటున్నారని, ఈ ఇళ్ల కేటాయింపు కోసం లాటరీ తీయొద్దని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్.. అధికారులతో విచారణ జరిపించి తొందరగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ అనంతరెడ్డి, హయత్‌నగర్, సరూర్‌నగర్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: శాంతి భద్రతల పరిరక్షణ, సిబ్బంది పనితీరు సమీక్ష నేరాల అదుపు చర్యలలో భాగంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నాగోల్, ఎల్బీనగర్, మీర్‌పేట, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, చైతన్యపురి, ఉప్పల్, మేడిపల్లి పోలీస్ స్టేషన్లను సోమవారం అర్ధరాత్రి రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్లలో రాత్రిపూట విధుల్లో ఉన్న సిబ్బంది, పెట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్, ఇతర అధికారుల పనితీరు పరిశీలించారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. రాత్రి పూట విధుల్లో మరింత శ్రద్ధగా పనిచేయాలని, తద్వారా స్మగ్లింగ్ వంటి వివిధ రకాల అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవచ్చని తెలిపారు.పోలీస్ స్టేషన్లకు సంబంధించిన వెహికల్ చెకింగ్ పాయింట్స్‌లను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు జరగకుండా చూడాలని, గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టాలని సిబ్బందికి సూచించారు.



అర్ధరాత్రి సమయంలో పోలీసుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ చౌహాన్

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశా: ఎమ్మెల్యే

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రూపురేఖలు మార్చామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని కాలనీవాసులతో విద్యుత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల సంక్షేమ సంఘ నాయకులు తమ కాలనీల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కొన్ని కాలనీలలో అంతర్గత రహదారులు, డ్రైనేజి వ్యవస్థ సరిగా లేదని, లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందులలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కరెంటు స్తంభాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్న కాలనీలలో చెత్త డబ్బాలు తొలగించాలని పలువురు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీవాసులు తన దృష్టికి వచ్చిన సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, శివప్రకాష్, శరత్‌చంద్ర, లక్ష్మీనారాయణ, విజయరంగా, జ్యోతి, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.